# "మీ కళ్లు ఎంతో బాగున్నాయి"

★ మిస్. ప్రభావతీ నాయుడు ★

రజని కథనం :

ప్రశాంతమైన సాయంసంధ్య. చుట్టూ ఉన్న చింత చెట్లు ఆ ప్రదేశానికొక వింతశోభను చేకూరుస్తున్నాయి. చింతకొమ్మల తెరల్లోంచి తొంగి చూస్తున్నాడు, సాయంత్రపు సూర్యుడు. చల్లని గాలి. సిద్ధహస్తుడైన చిత్రకారుడు చిత్రించిన అందమైన చిత్రంవలె ఉంది, పడమటి ఆకాశం.

ఆ స్థలానికి దగ్గరగా ఒక చిన్నకొండ. కొండ మొదట్లో ఒక తుమ్మచెట్టుకింద శిథిలమైన ఓ మందిరం. ప్రకృతి సౌందర్యాన్ని అనుభవిస్తూ అక్కడ కూర్చున్నాను, చేతిలో సినిమా పత్రికలోని బొమ్మలు తిరగేస్తూ.

పక్షుల అలికిడి. పక్కనే ప్రవహిస్తున్న చిన్న సెలయేరు. సెలయేటి ఒడ్డున నీలికలువలు. నా చుట్టూరా ఉన్న ప్రకృతి సౌందర్యం నన్నేదో స్వప్న లోకాల్లోకి తీసుకొని వెళుతున్నట్లనిపించింది. ఈ జగత్సౌందర్యమంతా ఎవరి ఆనందంకోరకు సృష్టింపబడింది ?

అప్రయత్నంగా గాలిలో సంగీతం తేలివచ్చింది.

"స్వేచ్ఛ స్వేచ్ఛయని చాటగ లేవా ?
నియమాలన్నీ, నిరోధమంతా నీకేనా !
కలువా ! కలువా ! చంద్రుని చూడగనే
పలువురు వినినను భయమేలాగుని
ఘక్కున నవ్వి వికాసము చూపగదే కలువా!"

పాట ఎవరు పాడుతున్నారో వెళ్ళి చూడాలని కుతూహలం కలిగింది. పాడుతున్నది స్త్రీ కంఠం అవడంవల్ల కుతూహలం మరింతి ఎక్కువైంది. పాట వినవచ్చేవేపు బయలుదేరాను. కలవపూల సౌందర్యశోభతో నిండిన ఆ నీటి ప్రవాహపు ఒడ్డున కూర్చుని కాగితంపైని ఆ దృశ్యాన్ని చిత్రిస్తూన్న ఒక యవ్వనంలో ఉన్న అమ్మాయి కనబడింది. చిత్రకారులకు సహజమైన పరధ్యానంతో—

"గాలి పూలతో సరసాలాడును !
ప్రపంచమంతా తానే మ్రోగును !
అది తగదనిరా ! తప్పనిరా ?
నియమాలన్నీ, నిరోధమంతా నీకేనా !

అని పాట సాగిస్తూ, కుంచెనుకూడా చేత్తో నడుపుతోంది. 'చిత్రమైన అమ్మాయి !' అనుకున్నాను. ఆమెలో ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఏదో గోచరించింది. ఆకర్షణీయమైన మొహంలో చలాకీతనం, భావపూరితమైన చూపులు.

నెమ్మదిగా వెళ్ళి ఒక పక్కగా కూర్చున్నాను, చేతిలో పత్రిక పుటలు తిరగవేస్తూ. కొంత సేపటికి తిరిగి చూసింది, ఆ చిత్రకారిణి. ఏమంటుందోనని ముందు భయపడ్డాను. అయినా ధైర్యంచేసుకుని కూర్చున్నాను. ఏదో పుస్తకం తీసుకుని పదేపదే నావేపు చూస్తూ గీతలు గీస్తోంది. నేనుమాత్రం ఏమీ ఎరగనట్లు పుస్తకం వేపు అలాగే చూస్తున్నా. ఆమె కొంచెం దగ్గరగా వచ్చి "దయచేసి ఇంకొక 'పోజ్'. ఇస్తారా ?" అని వినయపూర్వకంగా అడిగింది. ఏం జవాబియ్యాల్లో తెలీక అలాగే లేచి నించున్నా. "ఆc! ఆ పోజు చాలా బాగుంది. అలాగే కదలకుండా నిలవండి" అంటూ గబగబా 'స్కెచ్' చేస్తోంది. ఆమె ధైర్యంచూస్తే నాకే ఆశ్చర్యం వేసింది. బొమ్మ పూర్తి అయిన తరవాత ఆ బొమ్మకింద నన్ను సంతకం చెయ్యమంది. ఆమె కోరికకు బద్ధుడనై సంతకం చేశాను.

"Thanks" అంటూ తదేక దృష్టితో నా కళ్ళకేసిచూస్తూ, "ఏమీ అనుకోకండి, మీ కళ్లు చాలా బాగున్నాయి" అని భావపూరితంగా అంది.

మీ పేరు ?" అని ప్రశ్నించింది.

"రజనీకాంత్" అన్నాను, జంకుతూ.

* ఆనందవాణి

"మీ రెక్కడుంటారు? ఏమి చేస్తారు?" అంటూ గుక్క తిప్పకుండా ప్రశ్నించింది.

"ఇంజనీరింగు కాలేజీలో చదువుతున్నాను. ఉండడం హాస్టల్‌లో." అన్న నా వాక్యం పూర్తి కాకమునుపే తన సంగతి చెప్పడం మొదలు పెట్టింది:

"నా పేరు హేమంత నళిని. చిత్రకళాశాలలో చదువుకుంటున్నాను. ఇక్కడ out door sketching చెయ్యడానికి వచ్చాను. మీతో పరిచయం లేనిదే ఇవన్నీ మాటాడుతున్నందుకు ఏమీ అనుకోకండి. నా స్వభావమే అంత. మీ స్కెచ్ కూడా తీసుకున్నాను. మీ కళ్లు ఎంతో బాగున్నాయి. Thanks. వెళ్ళి వస్తాను. నమస్కారం."

అని చెప్పి వెళ్ళిపోయింది.

... ... ...

చీకటి పడుతుండగా హాస్టల్ చేరుకున్నాను. నా కళ్ళముందు హేమంతనళిని తప్ప మరేమీ కనబడ్డం లేదు. హేమంతనళిని! ఎంత చక్కని పేరు!

'మీ కళ్లు ఎంతో బాగున్నాయి' అన్న వాక్యమే నా హృదయాంతరాళాల్లో ధ్వనిస్తోంది. ఆ రాత్రి చదువు సాగలేదు......

రోజులు దొర్లిపోతున్నాయి. హేమంత నళిని సుందరాకారమే నా హృదయంలో నాట్యం చేస్తోంది.

... ... ...

నళిని కథనం :

స్కెచెస్ పూర్తిచేసుకుని సాయంత్రం ఇంటికి చేరుకున్నాను. ఒక నూతన ప్రపంచంలోకి ప్రవేశించినట్లుయింది......

అతని ఆకారమే ఎందువల్లో గాఢంగా హత్తుకుంది, మనస్సులో. అతని స్కెచ్ ఎన్నిసార్లు చూసినా తనివితీరడం లేదు.

ఒకొక్కప్పుడు అనుకుంటాను: మరి ఒకసారి అతని దర్శనం చేసుకుంటే! అని. కాని తరుణం ఎలా దొరుకుతుంది?

రోజులు గడిచిపోతున్నాయి......ఒకనాడు ఉషతో కలిసి రంగులు కొనుక్కోడానికి బజారుకి వెళ్లాను, బస్సులో. ఉలిక్కిపడ్డాను. నా ఎదుటి సీటులో కూర్చుని ఉన్నారాయన. శరీరం ఝల్లుమంది. పలకరిస్తే! పలకరిద్దామని కోరిక మాత్రం గాఢంగా కలిగింది. కాని ధైర్యం చాల లేదు. ఆయనకూడా నా వేపు అనురాగంతో చూశారు. కాని ఇద్దరం నిస్సహాయులం. హాస్టల్ వద్ద ఆయన దిగిపోయారు.

ఆ రోజు ఆదివారం. నా గదిలో కూర్చున్నాను. అమ్మ వచ్చి ముస్తాబు కమ్మని బలవంతం చేసింది. పెళ్లిచూపులకి వచ్చారు ఎవరో. నన్ను పరీక్షిస్తారట. తలుచుకుంటేే అసహ్యం వేసింది. ఉషకూడా బలవంతం చేసింది. పాపం, నా హృదయంలో బాధ ఆమెకి తెలీదు.

ఉష పరిగెత్తుకుంటూ వచ్చింది. "హేమా, హేమా! పెళ్లికొడుకుని చూశాను. అదుగో, గోడకి తగిలించావు చూడూ, నువ్వు గీసిన స్కెచ్, అన్నివిధాలా అలాగే ఉన్నాడు. ఒకసారి వెళ్లి చూడకూడదా!" అని గుక్క తిప్పుకోకుండా అంది.

ఇంతలోకే అన్నయ్య పెళ్లికొడుకుని తీసుకుని సరాసరి నా గదిలోకి ప్రవేశించాడు. "హేమా, నువ్వు రాకపోతే పెళ్లికొడుకే నీ దగ్గరకి వచ్చాడు, చూశావా!" అనుకుంటూ.

గది అంతా ఒక్కసారి భగ్గుమని వెలిగినట్లుయింది. ఇది నిజమా, లేక స్వప్నమా? నా కళ్ళని నేనే నమ్మలేకపోయాను. ఆ నాటి రజనీకాంతే నేటి పెళ్ళికొడుకు!

... ... ...

నా వివాహం సుందరస్వప్నంవలె గడిచిపోయిందని వేరే చెప్పనక్కరలేదు.

మొదటిరాత్రి. టేబిలుమీద పళ్లెం నిండా కలవపూవులు. ఒకపువ్వు అందిస్తూ ఆయన అన్నారు:

"హేమా! ఏదీ అ పాట—
...చంద్రుని చూడగనే
పలువురు వినినను భయమేలా యని
ఫక్కున నవ్వి వికాసము చూపగదే కలువా!"

నా వెనకటి ధైర్యం అంతా కరిగిపోయింది, ఎందువల్లో.

"మీ కళ్లు ఎంతో బాగుంటాయండీ" అని మాత్రం అనగలిగాను.